# కాకతీయ రాజులు

క్రీ.శ. 1000–1323 మధ్యకాలం ఆంధ్రదేశ చరిత్రలో కాకతీయ యుగంగా ప్రసిద్ధి. ఈ వంశస్థులు మొదటగా రాష్ట్రకూటుల వద్ద సైన్యాధికారులుగా, క్రమంగా తూర్పు, పశ్చిమ చాళుక్యుల వద్ద సామంతులుగా వ్యవహరించి స్వతంత్రరాజ్య దిశగా అడుగులు వేశారు. ఈ వంశ మొదటి వ్యక్తిగా 'వెన్నడు' పేరు కనిపిస్తుంది. సామంత ప్రభు హోదా అందుకున్న మొదటి వ్యక్తి 'ఎర్రయ' అని చెప్పవచ్చు. ఈయన కొరవి, మనుకోట ప్రాంతాలను పాలించాడు. కాకతీయులలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన ఘనత రుద్రదేవ లేదా మొదటి ప్రతాపరుద్రుడుది. ఈ వంశంలో గొప్పవాడు గణపతి దేవుడు, చివరివాడు రెండో ప్రతాపరుద్రుడని చెప్పవచ్చు. ఈ వంశ మూలపురుషుడు 'గుండ్యన' అనే అభిప్రాయం ఉంది. కాకతీయులు ఆంధ్రదేశాధీశ్వరులని ఖ్యాతి గడించారు.

కాకతి పేరు గల దేవతను పూజించడం వల్ల ఈ వంశస్థులకు కాకతీయులని పేరు వచ్చినట్లుగా విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణం, వినుకొండ వల్లభరాయుడి క్రీడాభిరామం అనే గ్రంథాలు చెబుతున్నాయి. కాకతిపురాన్ని పాలించడం వల్ల కాకతీయులని పేరు వచ్చినట్లు బయ్యారం చెరువు శాసనం తెలుపుతుంది. వీరి మొదటి రాజధాని హన్మకొండ. తర్వాత అది ఓరుగల్లుకు మారింది. ఈ వంశానికి చెందిన ప్రముఖ రాజుల గురించి సంక్షిప్తంగా...

## మొదటి బేతరాజు (క్రీ.శ. 1000–1030)

ఈయన పశ్చిమ చాళుక్యులకు సామంతుడిగా పాలన నిర్వహించాడు. హన్మకొండ నిర్మాత ఇతడే అనే అభిప్రాయం ఉంది. ఇతనికే గరుడ బేతరాజు అని కూడా పేరుంది. 'చోళచమూవార్ధి ప్రమథన' అనే బిరుదు ఇతనిదే.

## మొదటి ప్రోలరాజు (క్రీ.శ. 1030–75)

గరుడ బేతరాజు కుమారుడు మొదటి ప్రోలరాజు. ఈయన పాలన కాలం క్రీ.శ. 1053 ప్రాంతంలో వేయించిందే శనిగరం శాసనం. పశ్చిమ చాళుక్య రాజైన సోమేశ్వరునితో స్నేహం చేసి అతని నుంచి హన్మకొండపై లిఖితపూర్వక అధికారాన్ని సంపాదించాడు. ఇతనికి 'అరిగజకేసరి' అనే బిరుదు ఉంది. పశ్చిమ చాళుక్యుల వరాహ రాజచిహ్నాన్ని ఉపయోగించుకోవడానికి సోమేశ్వరుడు అనుమతి చ్చాడు. వ్యవసాయాభివృద్ధి జగతి కేసరి చెరువును తవ్వించాడు.

## రెండో బేతరాజు (క్రీ.శ. 1075–1108)

ఇతని కాలంలో పశ్చిమ చాళుక్యుల రాజ్యంలో రెండో సోమేశ్వరుడు, ఆరో విక్రమాదిత్య మధ్య ఆధిపత్య పోరు కొనసాగగా బేతరాజు ఆరో విక్రమాదిత్యకు సహకరించి విక్రమచక్రి, త్రిభువనమల్ల వంటి బిరుదులను పొందాడు. రెండో బేతరాజుకు కుడిభుజంగా, దండనాథుడిగా వ్యవహరించిన వ్యక్తి 'వైజ్య'. కాకతీయ వంశస్థులలో తొలి శైవుడు బేతరాజు–2 అని చెప్పవచ్చు. రామేశ్వర పండితుడి వల్ల శైవమత దీక్ష పుచ్చుకున్నాడు. కాలముఖ శైవశాఖను అభిమానించాడు. తన తండ్రి ప్రోలరాజు పేరు మీద హన్మకొండలో ప్రోలేశ్వరాలయాన్ని, తనపేరు మీద బేతేశ్వరాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. ఈయన పరమేశ్వర బిరుదాంకితుడు.

## రెండో ప్రోలరాజు (క్రీ.శ. 1116–1157)

మహామండలేశ్వర బిరుదాంకితుడు. ఇతని మంత్రి బేతన భార్య మైలమ హన్మకొండపై కడలాలయ జైనబసదిని నిర్మించింది. రెండో ప్రోలరాజు కాలం నాటివే హనుమకొండలోని పద్మాక్షి, సిద్ధేశ్వర ఆలయాలు. శివాలయంగా మారిన జైన ఆలయం 'పద్మాక్షి ఆలయం' అని తెలుస్తుంది.

## రుద్రదేవుడు (క్రీ.శ. 1158–1195)

ఇతనికి మొదటి ప్రతాపరుద్రుడని పేరు. రెండో ప్రోలరాజు కుమారుడు. కాకతీయులకు స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన వ్యక్తి. హన్మకొండ ప్రశస్తి శాసనం ఇతని కాలానిదే. దీనిని సంస్కృతంలో అచితేంద్రుడు లిఖించినట్లు చెప్పవచ్చు. ప్రతాపరుద్రుడు స్వయంగా కవి. ఇతడు సంస్కృతంలో 'నీతిసారం' అనే గ్రంథాన్ని రాశాడు. ఓరుగల్లు (ఏకశిలా నగరం) నిర్మాత ఇతడే. హన్మకొండలోని ప్రఖ్యాత సహస్ర స్తంభ దేవాలయం ఈయన కాలంలో నిర్మించిందే. ఇతని సేనాని వెల్లంకి గంగాధరుడు హన్మకొండలో ప్రసన్న కేశవాలయాన్ని నిర్మించాడు. ఇక్కడే రుద్రదేవుడు గంగచియ తటాకాన్ని నిర్మించాడు. పానగల్లులోని రుద్ర సముద్ర తటాకం ఈయన నిర్మించిందే. ఇతని ఆస్థాన కవి విద్యానాథుడు. ఈయన రాసిందే 'ప్రతాపరుద్ర యశోభూషణం'. రుద్రదేవుని ఆస్థానంలో కొంతకాలం గడిపిన పాల్కురికి సోమనాథుడు, వృషాధిప శతకాన్ని, బసవపురాణం, పండితారాధ్య చరిత్ర వంటి స్తుతి కావ్యాలను రాశాడు. పాల్కురికి సోమనాథుడు ఆంధ్రలో వీరశైవ మతాన్ని ప్రచారం చేశాడు.

ప్రఖ్యాత పల్నాటి యుద్ధం రుద్రదేవుని కాలంలోనే జరిగింది. ఈ యుద్ధంలో రుద్రదేవుడు నలగామరాజుకు సహకరించాడు. క్రీ.శ. 1195 ప్రాంతంలో రుద్రదేవుడు యాదవరాజైన జైతుగి చేతిలో హతుడయ్యాడు. పండిత, విద్యాభిమాని అయిన 'విద్యాభూషణ

SAKSHI

డు'గా కీర్తి పొందాడు.

## మహాదేవుడు (క్రీ.శ. 1195–98)

ఇతడు రుద్రదేవుని సోదరుడు. తన అన్న మరణానికి కారకుడైన యాదవ జైతుగిపై ప్రతీకారానికి యాదవుల రాజధాని దేవగిరిపై దండెత్తాడు. జైతుగి చేతిలో హతుడయ్యాడు. ఇతని కుమారుడు గణపతి దేవుడు జైతుగి చేతిలో బంధీ అయ్యాడు.

## గణపతి దేవుడు (క్రీ.శ. 1199–1262)

యాదవ రాజైన జైతుగి చేతిలో బంధీగా ఉన్న గణపతి దేవుడిని రక్షించి, సింహాసనంపై కూర్చొపెట్టిన ఘనత రేచెర్ల రుద్రుడిది. కాకతిరాజ్య స్థాపకుడిగా రేచెర్ల రుద్రుడు ప్రతీతి. గణపతి దేవుడి రాజకీయ గురువు 'విశ్వేశ్వర శంభు'.

శాతవాహనుల తర్వాత యావదాంధ్ర దేశాన్ని జయించి, పాలించిన ఘనత గణపతి దేవుడిది. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని పూర్తిచేసి రాజధానిని ఓరుగల్లుకు మార్చాడు. వెలనాటి పృథ్వీశ్వరుడు గణపతి దేవుడి చేతిలో ఓడిపోయాడు. నెల్లూరు, కంచిలపై దండెత్తిన గణపతి దేవుడు రాజ్యాన్ని దక్షిణాన కంచి వరకు విస్తరింపజేశాడు. సకలదేశ ప్రతిష్ఠాపనాచార్య బిరుదాంకితుడు. కాకతీయుల కాలంలో ప్రముఖ రేవుగా పేరుగాంచిన మోటుపల్లిని అభివృద్ధి చేసి, అభయ శాసనాన్ని వేయించాడు. సిద్ధయ్య దేవుడనే సేనానిని మోటుపల్లి నిర్వహణకు నియమించాడు. నెల్లూరు ప్రభువైన రెండో మనుమసిద్ధి బయ్యన, అక్కన చేతిలో ఓడి రాజ్యభ్రష్టుడయ్యాడు. కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి పొందడానికి మనుమసిద్ధి, తన ఆస్థానకవి తిక్కనను గణపతి దేవుడి సహాయాన్ని అర్థించడానికి రాయబారిగా పంపాడు. గణపతి దేవుడి సహకారంతో రెండో మనుమసిద్ధి, నెల్లూరును తిరిగి ఆక్రమించగలిగాడు. తిక్కన ఓరుగల్లులో ఉన్న సమయంలో మహాభారతంలో విరాటపర్వం మొదలు 15 పర్వాలను తెలుగులోకి అనువదించాడు. తిక్కనకు కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు అనే బిరుదులున్నాయి. ఇతడు రాసిందే నిర్వచనోత్తర రామాయణం. గణపతి దేవుడు ముత్తకూరు యుద్ధంలో జటావర్మ సుందరపాండ్య చేతిలో ఓడిపోయాడు.

గణపతి దేవుని అశ్వికసాహిణి గంగయ, గజసాహిణి జాయప. జాయప ప్రముఖ సంస్కృత పండితుడు. నృత్య రత్నావళి, గీత రత్నావళి, వాద్య రత్నావళి ఇతడు రాసినవే.

గణపతి దేవుడు పాశుపత శైవమతాన్ని ఆచరించాడు. ఈయన శైవమత దీక్షా గురువు 'విశ్వేశ్వర శైవాచార్య'. గణపతి దేవుడి నాణేలపై రాయగజకేసరి అనే బిరుదు కనిపిస్తుంది. గణపతి దేవుడి కాలంలో పాలంపేటలో రేచెర్ల రుద్రుడు సుప్రసిద్ధ రామప్ప దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తుంది. గణపతి దేవుడి కుమార్తెలు రుద్రమ, గణపాంబ. రామప్ప (చెరువుని తవ్వించిన రేచెర్ల రుద్రుడు) పాకాల, లక్కవరం, నెల్లూరులలోని తటాకాలు గణపతి దేవుడి కాలంలో నిర్మించారు.

## రుద్రమదేవి (క్రీ.శ. 1262–1289)

గణపతి దేవుడి కుమార్తె, రుద్ర మహారాజు బిరుదుతో పట్టాభిషిక్తురాలైంది. రుద్రమ రాజ్య ప్రారంభంలో అంతర్గత తిరుగుబాట్లను అణచి రాజ్య స్థిరీకరణలో ప్రముఖపాత్ర వహించిన రేచెర్ల ప్రసాదిత్యుడు 'కాకతిరాజ్య భారధౌరేయ' అనే బిరుదును ధరించినట్లు తెలుస్తుంది. 'బీదర్ శాసనం' ప్రకారం యాదవ రాజైన మహాదేవుడు రుద్రమదేవి చేతిలో ఓడిపోయినట్లు తెలుస్తుంది. యాదవులపై విజయానికి చిహ్నంగా ఓరుగల్లు స్వయంభూ దేవాలయంలో రంగ మండపాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. యాదవులపై విజయానికి చిహ్నంగా ఈమె ధరించిన బిరుదు 'రాజగజకేసరి'. నిరవద్య పురాధీశ్వరుడైన చాళుక్య వీరభద్రుడు రుద్రమదేవి భర్త. రుద్రమదేవి పాలన కాలంలోనే వెనీస్ యాత్రికుడైన మార్కోపోలో కాకతీయ రాజ్యాన్ని సందర్శించాడు. ఆంధ్రదేశాన్ని పాలించిన మొదటి మహిళగా రుద్రమదేవి కీర్తిని గడించింది. రుద్రమదేవి కాలం నాటిదే 'మల్కాపురం శాసనం'. ఈ శాసనం పాశుపత శైవానికి సంబంధించి విలువైన సమాచారాన్ని తెలుపుతుంది.

రుద్రమదేవి కాలంలో.. ఈమె రాజకీయాధిపత్యాన్ని ధిక్కరించి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న సామంతుడు కాయస్థ అంబదేవుడు. కాకతీయులపై అంబదేవుడు విజయం సాధించినట్లు 'చందుపట్ల శాసనం' తెలుపుతుంది. కాయస్థ అంబదేవుడితో జరిగిన పోరులో రుద్రమతో పాటు ప్రధానసేనాని మల్లిఖార్జునుడు మరణించినట్లు తెలుస్తుంది.

## ప్రాక్టీస్ ప్రశ్నలు...

**1. 'కాకతీయ రాజ్యభార ధౌరేయ'గా పేరుగాంచిన వ్యక్తి?**

ఎ) రేచెర్ల రుద్రుడు బి) రేచెర్ల ప్రసాదిత్య
సి) రుద్రదేవ డి) రెండో ప్రతాపరుద్ర

**2. స్వతంత్ర కాకతీయ రాజ్య స్థాపకుడు?**

ఎ)వెన్నడు బి)గుండ్యన
సి)మొదటి బేతరాజు డి)మొదటి ప్రతాపరుద్ర

**3. గణపతి దేవుడికి రాజకీయ, మతగురువుగా వ్యవహరించిన వ్యక్తి?**

ఎ) విశ్వేశ్వర శంభు బి) రామేశ్వర పండితుడు
సి) తిక్కన డి) మారన

**4. గురువుగా, పండితునిగా ప్రఖ్యాతిగాంచిన విద్యానాథుడు ఎవరి ఆస్థానానికి చెందినవాడు?**

ఎ) గణపతిదేవ బి) మొదటి ప్రతాపరుద్ర
సి) రెండో ప్రతాపరుద్ర డి) రెండో ప్రోలరాజు

**5. తిక్కన శిష్యుడు, మార్కండేయ పురాణాన్ని రాసిన వ్యక్తి?**

ఎ) మంచన బి) మారన
సి) కేతన డి) శివదేవయ్య

**6. గణపతి దేవుని అశ్వికసాహిణి?**

ఎ) జాయప బి) గంగయ
సి) వెల్లంకి గంగాధర డి) మల్లిఖార్జునుడు

SAKSHI

**7. రుద్రమదేవి యాదవులపై సాధించిన విజయాలను గురించి తెలుపు శాసనం?**

ఎ) మల్కాపురం బి) బయ్యారం

సి) శనిగరం డి) బీదర్

**8. కాకతీయ సామ్రాజ్యం పతనమైన సంవత్సరం?**

ఎ) క్రీ.శ. 1318 బి) క్రీ.శ. 1321

సి) క్రీ.శ. 1322 డి) క్రీ.శ. 1323

**9. కిందివాటిలో రాజనీతి గ్రంథం?**

ఎ) నీతిసారం బి) శివతత్వసారం

సి) కేయూరబాహు చరిత్ర డి) ప్రేమాభిరామం

**10. హన్మకొండ శాసనం రాసింది?**

ఎ) మొదటి ప్రతాపరుద్ర బి) అచితేంద్రుడు

సి) విద్యానాథ డి) మల్లిఖార్జున

| జవాబులు | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | B | D | A | B | B | B | D | D | A | B |

SAKSHI

# కాకతీయులు - మత, సాంఘిక పరిస్థితులు

## రెండో ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1289-1323)

ఇతడు రుద్రమదేవి మనుమడు. ముమ్మడమ్మ, మహదేవుల కుమారుడు. సింహాసనాన్ని అధిష్టించగానే తిరుగుబాటు జరుపుతున్న కాయస్థ అంబదేవుని ఓడించాడు. అంబదేవుని ఓడించడంలో ప్రతాపరుద్రుని తరపున ఇందులూరి అన్నయ మంత్రి ప్రముఖపాత్ర వహించాడు. ఆడిదం మల్లు సేనాని నాయకత్వాన నెల్లూరుపై దాడి జరిగింది. నెల్లూరు పాలకుడైన మనుమగొండ గోపాలుని సంహరించి ఆడిదం మల్లు ''మనుమగొండ గోపాల శిరఃఖండన'' అనే బిరుదు వహించాడు. కాకతి రాజ్య విస్తీర్ణం రెండో ప్రతాపరుద్రుని కాలంలో అత్యున్నత స్థితికి చేరింది. తన పాలన దక్షతతో దేశరక్షణకు సైన్యాన్ని సిద్ధం చేయడానికి 'నాయంకర వ్యవస్థ'ను పునర్నిర్మించాడు. కంచిపురంపై కాకతీయుల ఆధిపత్యాన్ని స్థాపించాడు. ఇతని కాలంలో రాజ్యాం 77 నాయంకరలు(సైనిక విభాగాలు)గా విభజితమై ఉండేది.

రెండో ప్రతాపరుద్రుని కాలంలోనే కాకతీయ రాజ్యంపై 5 సార్లు ముస్లిం దండయాత్రలు జరిగాయి.

1. క్రీ.శ. 1303 ఫకృద్దీన్ జునా నాయకత్వంలో జరిగిన దాడి విజయవంతం కాలేదు.
2. క్రీ.శ. 1309-10లో అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కాఫర్ నాయకత్వంలో జరిగిన దాడి విజయవంతమైంది.
3. క్రీ.శ. 1319 ప్రాంతంలో ఖుస్రూఖాన్ నాయకత్వంలో జరిగిన దాడి విజయవంతమైంది.
4. క్రీ.శ.1323లో జునాఖాన్(మహ్మద్ బిన్ తుగ్లక్) నాయకత్వంలో 2 సార్లు దాడి జరిగింది.
5. అయిదో దండయాత్రలో జునాఖాన్ ప్రతాపరుద్రుని ఓడించి బందీగా ఢిల్లీకి తీసుకెళ్తుతున్న సమయంలో మార్గమధ్యంలో నర్మద నది తీరంలో ప్రతాపరుద్రుడు మరణించినట్లు తెలుస్తుంది. జునాఖాన్ కాకతీయ రాజ్యాన్ని ఢిల్లీ సుల్తాన్ రాజ్యంతో కలిపి ఓరుగల్లు పేరును 'సుల్తాన్‌పూర్'గా మార్చివేశాడు. ఈ విధంగా క్రీ.శ. 1323లో కాకతీయ రాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో కలిసిపోయింది.

## సామాజిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో రాజ్యానికి ప్రధాన ఆదాయం భూమిశిస్తు. పంటలో 1/4 నుంచి 1/2 వరకు శిస్తుగా వసూలు చేసేవారు. వీరికాలంలో మోటుపల్లి (దేశీయకొండ) ప్రముఖ రేవు. కాకతీయ తొలి రాజులు జైనులు. రెండో బేతరాజు నుంచి ఈ వంశస్థులు శైవమతాన్ని అవలంభించారు. పాశుపత శైవానికి అధిక ఆదరణ లభించినప్పటికీ కాలముఖ, కాపాలిక శాఖలు కూడా వర్ధిల్లినట్లు చెప్పవచ్చు. కాకతీయుల రాజలాంఛనం వరాహం. కాకతి రుద్రమదేవి కాలం నుంచి ఆంధ్రదేశంలో వైష్ణవం విశేష వ్యాప్తి పొందింది.

కళ, వాస్తు, శిల్ప రంగాలలో కాకతీయులు చాళుక్యుల శైలి సంప్రదాయాలను అనుసరించారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి, పద్మాక్షి ఆలయం, పాలంపేటలోని రామప్ప ఆలయం, పిల్లలమర్రిలోని ఏకేశ్వర, నామేశ్వర ఆలయాలు, మంథనిలోని గౌతమేశ్వరాలయం, ఓరుగల్లు దుర్గం వీరి కాలంనాటి నిర్మాణాల్లో ప్రముఖమైనవి. పిల్లలమర్రి, పాలంపేట ఆలయాల సభామంటపాల పైకప్పుల్లో కాకతీయుల కాలంనాటి చిత్రలేఖన అవశేషాలు కనిపిస్తాయి. పిల్లలమర్రి ఆలయ సభామంటప పైకప్పులో 'క్షీరసాగరమథన' దృశ్యం చిత్రీకరించి ఉంది. వీరి నిర్మాణాల్లో ఎక్కువ శివాలయాలే. కాకతీయుల నాటి శిల్పకళకు పరాకాష్ట 'రామప్ప దేవాలయం'. కాకతీయుల కాలంలో గద్యాణం అనే బంగారు నాణెం, రూక అని పిలిచే వెండి నాణేలు అమలులో ఉన్నాయని చెప్పవచ్చు. వీరి శిల్పకళలో ప్రధాన ఆకర్షణ 'తోరణ స్తంభాలు'.

కాకతీయుల రాజభాష సంస్కృతం. వీరి శాసనాలు ఎక్కువగా సంస్కృత భాషలోనే ఉన్నాయి. ఈ యుగంలో సాహిత్యరంగం ఎంతో ప్రగతి సాధించింది. మొదటి ప్రతాపరుద్రుని యయాతి చరిత్ర, నీతిసారం (రాజనీతి ముఖ్యాంశం) వంటి సంస్కృత రచనలు, గంగాధరుడు రాసిన మహాభారతం, నరసింహుని కాదంబరి కళ్యాణం, రావిపాటి త్రిపురాంతకుని ప్రేమాభిరామం వంటి సంస్కృత నాటకాలు, మారన రాసిన మార్కండేయ పురాణం, మంచన రాసిన కేయూరబాహు చరిత్ర, అభినవదండిగా పేరొందిన కేతన రాసిన దశకుమార చరిత్ర, వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామం వంటి తెలుగు అనువాదాలు, బద్దెన రాసిన నీతిశాస్త్ర ముక్తావళి, ముడికి సింగన రాసిన సకల నీతిసమ్మతం, శివదేవయ్య రాసిన పురుషార్థ సారం వంటి తెలుగులో రాసిన రాజనీతి గ్రంథాలు, మల్లికార్జున పండితుని శివ తత్త్వసారం, యథావాక్కుల అన్నమయ్య రాసిన సర్వేశ్వర శతకం, బద్దెన రాసిన సుమతి శతకం వంటివి కాకతీయుల కాలంలోనే రూపుదిద్దుకున్నాయి. ఈ కాలంనాటి తెలుగులో రూపొందిన ద్విప దరచనలుగా గోన బుద్ధారెడ్డి రాసిన రంగనాథ రామాయణాన్ని, పాల్కురికి సోమనాథుని బసవ పురాణం, పండితారాధ్య చరిత్రలను పేర్కొనవచ్చు. వల్లభరాయుని క్రీడాభిరామంలో కనిపించే 'మాచల్దేలి' మొదటి ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె.

## కాకతీయుల కాలం - కాయస్థ వంశస్థులు

వీరు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన కాయస్థ కుటుంబీకులై ఉంటా

SAKSHI

రనే అభిప్రాయం ఉంది. కాకతీయులు ఆంధ్ర దేశానికి వచ్చి తూర్పు గాంగులకు సామంతులుగా, మాండలికులుగా, సేనాధిపతులుగా, దండనాయకులుగా, అశ్వ సైన్యాధిపతులుగా వ్యవహరించారు. కాయస్థులు బ్రాహ్మణులు, శివభక్తులు. త్రిపురాంతక మహాదేవుని పాదపద్మారాధకులు. వీరి కాలంనాటి 12 శిలాశాసనాలు త్రిపురాంతకంలో లభించినట్లు తెలుస్తుంది. వీరి రాజధానులుగా కడప జిల్లాలోని వల్లూరు, జమ్మలమడుగు తాలుకాలోని గండికోట మనోరథ పురంలను పేర్కొంటారు. వీరి పాలన గంగయ సాహిణితో ప్రారంభమై జన్నిగదేవ, త్రిపురాంతక, అంబదేవ, రెండవ త్రిపురారి వంటివారి పాలనతో ముగుస్తుంది. వీరి రాజ్యం చివరకు కాకతీయుల వశమైందని చెప్పవచ్చు.

## గంగయసాహిణి

కాయస్థ రాజుల్లో మొదటివాడు. కాకతి గణపతి దేవుని ఆదరణ పొంది, కొంతకాలం అశ్వికసాహిణిగా అనంతరం మాండలిక ప్రభువుగా నియమితుడైనాడు. ఇతని కాలంలో త్రిపురాంతకంలో శాసనం వేయించారు. ఇతని భార్య కమలాబాయి వేయించిన శాసనం 'గంగవర శాసనం'. గంగయసాహిణికి మహా మండలేశ్వర, చాతుర్వర్గ సముద్ధరణ, నాయక నారాయణ, వీరావతార వంటి బిరుదులున్నట్లు తెలుస్తుంది. గంగయ సోదరి చందుబాయి, బావ అంబాక్ష్మపతి గంగ యసాహిణికి చేదోడువాదోడుగా ఉండేవారని తెలుస్తుంది. పానగల్లు మొదలుకుని మహారాజవాడి (కడప ప్రాంతం) వరకు ప్రాంతం గంగయసాహిణి పాలనలో ఉన్నట్లు తెలుస్తుంది. యాదవ సామంతుడైన దామోదరుని దాడిని గంగయసాహిణి ఎదుర్కొన్నట్లు తెలుస్తుంది.

## జన్నిగదేవ

ఇతడు అంబాక్ష్మపతి, చందుబాయిల కుమారుడు. గంగయసాహిణి మేనల్లుడు. కాకతీయుల అభిమానం పొందిన జన్నిగదేవ 12 ఏళ్ల పాటు పాలించినట్లు తెలుస్తుంది. (సుమారు క్రీ.శ. 1258– 1270) ఇటిగుల్లపాడు, పొదలూరు, కారెంపూడి శాసనాలు ఇతని కాలంలో వేయించినట్లు తెలు స్తుంది. ఇతని కాలంలో ప్రముఖపాత్ర వహించిన మంత్రులుగా అనంతదేవ, మొయిదేవ, తాళ్లపల్లి దేవరాజులను పేర్కొనవచ్చు. ఇతని అనంతరం సోదరుడైన త్రిపురాంతకుడు రాజ్యానికి వచ్చాడు.

## అంబదేవుడు

ఇతడు గంగయసాహిణి మూడో మేనల్లుడు. కాయస్థ వంశస్థుల్లో ఘనుడు. క్రీ.శ. 1272– 1303 మధ్య పాలించినట్లు తెలుస్తుంది. మొదటగా కాకతీయులను ఎదిరించి స్వతంత్ర పాలనకు పూనుకున్నాడు. రుద్రమదేవికి సమకాలికుడు. రుద్రమ పంపిన 75 కంటే ఎక్కువ మంది రాజులను ఇతడు ఓడించినట్లు తెలుస్తుంది. అతికష్టం మీద ఇతడు రెండో ప్రతాపరుద్రుని చేతిలో ఓటమి పాలైనట్లు తెలుస్తుంది. ఇతని కాలంనాటి శాసనాలుగా రాజంపేట శాసనం, త్రిపురాంతకంలో వేయించిన శాసనాన్ని పేర్కొన్నారు. క్రీ.శ. 1308 ప్రాంతంలో కాయస్థుల రాజ్యం పూర్తిగా కాకతీయ సామ్రాజ్యంలో కలిసిపోయినట్లు తెలుస్తుంది.

## ప్రాక్టీస్ ప్రశ్నలు...

**1. కాకతి రుద్రమదేవి ఎవరి చేతిలో మరణించింది?**

ఎ) గంగయసాహిణి బి) జన్నికదేవ
సి) అంబదేవ డి) కాపయ నాయక

**2. 'ఆంధ్ర సురత్రాణ'గా ప్రసిద్ధి పొందినదెవరు?**

ఎ) కాటయ వేమారెడ్డి బి) అంబదేవుడు
సి) కాపయ నాయక డి) ప్రోలయ నాయక

**3. కాయస్థ రాజ్యం చివరకు ఎవరి వశమైంది?**

ఎ) కాకతీయులు బి) రెడ్డి రాజులు
సి) విజయనగర రాజులు డి) ముసునూరి నాయకులు

**4. ముసునూరి నాయకులు ఏ ప్రాంతం రాజధానిగా పాలన ప్రారంభించారు?**

ఎ) ఓరుగల్లు బి) రేఖపల్లి
సి) వల్లూరు డి) రాజమహేంద్రవరం

**5. కాకతీయుల రాజభాష ఏది?**

ఎ)సంస్కృతం బి)ప్రాకృతం
సి)తెలుగు డి)ఏదీకాదు

**6. మార్కండేయ పురాణం రాసిందెవరు?**

ఎ) మారన బి)బద్దెన
సి) నరసింహుడు డి) త్రిపురాంతకుడు

**7. కాకతీయుల పాలన ఎప్పుడు అంతమైంది?**

ఎ) క్రీ.శ. 1323 బి) క్రీ.శ. 1365
సి) క్రీ.శ. 1223 డి) క్రీ.శ. 1310

| జవాబులు | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
|---|---|---|---|---|---|---|---|
| | C | C | A | B | A | A | A |

SAKSHI

# కాకతీయుల పాలనా వైభవం

## కాకతీయుల కాలం నాటి పరిస్థితులు
## (ఆంధ్రుల చరిత్ర–సామాజిక పరిస్థితులు)

**కాకతీయుల పరిపాలనా విధానం:** కాకతీయులు సంప్రదాయబద్ధమైన రాజరికాన్ని అనుసరించారు. రాజరికం వంశపారంపర్యం. రాజు నిరంకుశుడైనప్పటికీ ధర్మశాస్త్రాల ప్రకారం పాలన సాగేది. దత్తత ద్వారా వారసత్వ హక్కు ఉండేది. ఈ హక్కు ప్రతాపరుద్రుడికి లభించింది. పురుషునితో పాటు స్త్రీకి రాజ్యాధికార హక్కు కల్పించారు. కాకతీయుల పాలనా విషయాలు ప్రధానంగా శాసనాలు, రాజనీతిని వివరించే గ్రంథాల ఆధారంగా ఉన్నాయి. బద్దెన–నీతిశాస్త్ర ముక్తావళి, మడికి సింగన–సకల నీతి సమ్మతం, సిద్ధదేవయ్య–పురుషార్థసారం, ప్రతాపరుద్రుడు–నీతిసారం గ్రంథాలు ముఖ్యమైనవి. రాజు సర్వాధికారి. వర్ణాశ్రమ ధర్మాలను కాపాడాలి. 'చాతుర్వర్ణ సముద్ధరణ' ముఖ్యమని కాయస్థ అంబదేవుని త్రిపురాంతక శాసనం తెలుపుతోంది. రాజుకు వేదాలు–శాస్త్రాలు, సాహిత్యం, కళల పట్ల అవగాహన ఉండాలి. వేదశాస్త్ర –రాజనీతి కోవిదులైన బ్రాహ్మణులనే మంత్రులుగా నియమించాలని రాజనీతి గ్రంథాలు పేర్కొంటున్నాయి. రాజు పరిపాలనలో మంత్రిమండలి పరిషత్తు ఉండేది. కాకతీయులు అన్ని వర్గాల ప్రజలకు మంత్రిమండలిలో అవకాశమిచ్చారు. పరిపాలనలో మహా ప్రధానులు, ప్రధానులు, ప్రెగ్గడలు, అమాత్యులు, మంత్రులు ఉన్నట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. ఉదా: హేమాద్రి రెడ్డి, ముప్పిడినాయక వంటి బ్రాహ్మణేతరులను 'మహా ప్రధానులు' కాకతీయులు నియమించారు. రాజు కొలువులో అన్ని తరగతులకు చెందిన అధికారులుండేవారు.

ఈ కాలంలో 72 నియోగాలున్నాయి. వీటినే బహత్తర నియోగం అనేవారు. ఈ 72 శాఖలపై ఉన్నతాధికారిని 'బహత్తర నియోగపతి' అనేవారు. కాకతీయుల పాలనా వ్యవస్థ నాయంకర వ్యవస్థ. అత్యవసర పరిస్థితుల్లో నాయంకర్లు రాజుకు సైన్యాన్ని సరఫరా చేసేవారు. వీరి సేవలకు రాజులు 'నాయక స్థలాలు' (భూములను) ఇచ్చేవారు. ప్రతాపరుద్రుడు ఓరుగల్లు కోటను రక్షించడానికి 77 మంది వెలమ నాయకులను నియమించాడు. వీరి సేవలకు రాజు 1/4 వంతు భూమిని ఇచ్చినట్లు తెలుస్తోంది. రాజుకు అంగరక్షకులుగా లెంకలను నియమించేవారు. (లెంకలు అంటే అంగరక్షకులు) యుద్ధ సమయాల్లో 'లెంకలు' ఆత్మాహుతి చేసుకొనేవారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని నాడులు (రాష్ట్రాలు), స్థలాలు, గ్రామాలుగా విభజించారు. చివరి పాలనా విభాగం గ్రామం. 'స్థలాలు'– రెండు గ్రామాల నుంచి అరవై గ్రామాల వరకు ఉండేవి. కొన్ని స్థలాల సముదాయమే 'నాడులు'. ఉదా: అనుమకొండనాడు, కమ్మనాడు, పాకనాడు, ములికినాడు, పొత్తపినాడు, సబ్బినాడు, కందూరునాడు.. రాజ్య సరిహద్దులను 'వాడి', 'భూమి' అనేవారు. ఉదా: నరవాడి, నటవాడి, ఆరె భూమి మొదలైనవి.

**గ్రామ పరిపాలన:** కాకతీయుల కాలంలో గ్రామాల్లో స్వయంపాలన ఉండేది. గ్రామపాలనను 'ఆయగార్లు' చూసేవారు. 'ఆయం' అంటే పొలం. విస్తీర్ణం బట్టి ఉండే భూమినే ఆయం అనేవారు. ఈ భూములపై పన్నులు లేవు. గ్రామసేవలు చేసేందుకు పన్నులు లేకుండా భూమిని పొందినవారిని 'ఆయగార్లు' అంటారు. పన్నెండుమంది ఆయగార్లు గ్రామపాలనను నిర్వహించేవారు. కరణం పెదకాపు (రెడ్డి), తలారి, పురోహితుడు, కమ్మరి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, చాకలి, మంగలి, శెట్టి, చర్మకారుడు వీరందరూ రెడ్డి, కరణంతో కలిసి గ్రామపాలనను నిర్వహించేవారు. 'తలారి' అంటే గ్రామ రక్షకభటుడని చెప్పవచ్చు. రాజ్యాన్ని నాడులు, స్థలాలు, మండలాలు, సీమలుగా విభజించారు.

**ఆదాయం:** రాజ్య ఆదాయానికి భూమిశిస్తు ప్రధాన మార్గం. వృత్తి పన్నులుండేవి. భూమిని నాలుగు రకాలుగా విభజించారు. పనికిరాని భూములు, పంట భూములు, తోట భూములు, పచ్చికబయళ్లు. ధాన్యాన్ని కొలిచే సాధనాలను– కపిల, ఖండుగ అని పిలిచేవారు. భూమిని గడ(కోల)తో కొలిచేవారు. పన్నులు ధాన్య, ధనరూపంలో చెల్లించేవారు.

అగ్రహారాలకు, దేవాలయాలకిచ్చే భూములపై పన్నులుండేవి కావు. పన్నులు వసూలు చేసేవారిని సుంకరులు అనేవారు. రాజుగారి సొంత భూములను 'రాచదొడ్డి' అనేవారు. పచ్చికబీడులపై వేసే సుంకాన్ని 'పుల్లరి సుంకం' అనేవారు. పంట పొలాలకు చెరువుల ద్వారా నీరు అందించేవారు. నీటికట్టు, ఆయకట్టు, గుడికట్టు అనే పదాలు శాసనాల్లో కన్పిస్తాయి. మొదటి ప్రోలరాజు నిర్మించిన కేసరి చెరువు, గణపతిదేవుడు తవ్వించిన రామప్ప, పాకాల, లక్నవరం చెరువులు ప్రధానమైనవి.

భారీ సాగునీటి సదుపాయాన్ని ఆంధ్రదేశంలో చేపట్టిన 'తొలి రాజులు' కాకతీయులే. వీరి కాలంలో సుగంధ ద్రవ్యాలు ముఖ్య ఎగుమతులు. పంట పన్నులు వసూలు చేసేవాడిని ఫలదారి లేదా తిరుపారి అనేవారు. శ్రీభండారు అంటే కోశాధికారి. నీటికాడు– నీటిపారుదల చూసేవాడు.

**సైనిక శక్తి:** రాజ్య రక్షణకు పటిష్టమైన సైనిక వ్యవస్థను ఏర్పాటు చేశారు. సైన్యంలో గజ, తురగ, పదాతి దళాలు ప్రధానమైనవి. గుర్రాలకు, ఏనుగులకు శిక్షణలో అశ్వసాహిణులు, గజసాహిణులు అనే అధికారులు పర్యవేక్షించేవారు. ప్రతాపరుద్రుడి 'నీతిసారం' ప్రకారం స్థల, జల, వన, గిరి, దుర్గాలు (కోటలు) ఉండేవి. అనుమకొండ, రాయచూరు, గండికోటలను గిరిదుర్గాలంటారు. కందూరు, నారాయణవనం (వనదుర్గాలు). దివిసీమ, కొలను (కొల్లేరు), జలదుర్గాలు. ఓరుగల్లు, ధరణికోట, స్థలదుర్గాలుగా ఈ గ్రంథం పేర్కొంది.

రాజు సైన్యాన్ని దండాధిపతులు, సేనాధిపతులు పర్యవేక్షించేవారు. రాజు సర్వసైన్యాధ్యక్షుడు. కొన్ని సమయాల్లో సేనానులు

SAKSHI

యుద్ధాలు నిర్వహించేవారు. సేనాని రేచర్లరుద్రుడు, మహాదేవుడు శత్రువులపై సైన్యాలు నడిపారు. యుద్ధ సమయాల్లో ధైర్య సాహసాలు ప్రదర్శించే సేనానులకు గొప్ప బిరుదులిచ్చి సత్కరించేవారు. శాసనాల్లో కోటగెల పాక, వెలనాటిదూషక, కాంచీ-కవాటచూరకార, సూర్యవంశ స్థాపనాచార్య, మారురాయజ గద్దల, చలమర్తిగండ, గండపెండేర వంటి బిరుదుల వివరాలున్నాయి.

**సాంఘిక పరిస్థితులు:** కాకతీయుల నాటి సమాజం చాతుర్వర్ణ వ్యవస్థపై ఆధారపడింది. ఉపకులాలుండేవి. సమాజంలో బ్రాహ్మణులకు ఉన్నత స్థానం. వీరు విద్యా-మతపరమైన బాధ్యతలు చేపట్టేవారు. కాకతీయులు 'చతుర్థకుల సంజాతులని' అత్యధిక చరిత్రకారులు భావిస్తారు. కులం విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ కాలంలో వెలసిన రాజ వంశాలన్నీ చతుర్థకుల సంజాతులే!

కోమటి, శెట్టిలను వైశ్యులని అంటారు. ఆనాటి వర్తకం-వాణిజ్యంతో పాటు వ్యవసాయం, పశుపోషణ కూడా చేసేవారు. ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు వైశ్యులదే ప్రధాన పాత్ర. సమాజంలో అధిక సంఖ్యాకులు శూద్రులు. వ్యవసాయం, పశుపోషణ ముఖ్యవృత్తి. చండాలులు పంచమ కులంగా ఏర్పడ్డారు. శూద్రుల్లో రెడ్డి, వెలమ, కమ్మ, తెలగ అనే ఉపకులాలున్నాయి. ప్రతాపరుద్రుడి కాలంలో 'వెలమలు' సైనిక పాత్ర నిర్వహించారు. కాకతీయుల అనంతరం రాచకొండలో వెలమలు, కొండవీటిలో రెడ్లు రాజ్యాలు స్థాపించారు.

సమాజంలో స్త్రీలకు ఆస్తిహక్కు కల్పించారు. బాల్య వివాహాలు, సతీసహగమనాలు వంటి దురాచారాలుండేవి. సంఘంలో వేశ్యలకు, దేవదాసీలకు గౌరవస్థానముండేది. ప్రతాపరుద్రుడి కాలంలో 'మాచల దేవి' అనే నాట్యకళాకారిణి ప్రశంస విన్పిస్తుంది. వ్యవసాయపరమైన పండుగలు ఏరువాక, సంక్రాంతి, గొబ్బిళ్లను గ్రామాల్లో జరుపుకొనేవారు. సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలు ప్రధాన పంటలు. ఇల్లరి, పుల్లరి, ఉప్పు గానుగలపై పన్నులు వసూలు చేసేవారు. భూమి శిస్తు అదనంగా వసూలు చేసేవారు. అన్ని తరగతులకు చెందిన స్త్రీలు అలంకరణలో ఆసక్తి చూపారు. కోలాటాలు, చింతులాటలు, గొండ్లి నృత్యాలు, గొబ్బెమ్మ నృత్యాలు కొన్ని వినోదాలు.

**మత పరిస్థితులు:** కాకతీయుల కాలంలో శైవమతం విశేష ఆదరణ పొందింది. కాలాముఖ, కాపాలిక, పాశుపత, శైవమత శాఖలు విస్తారంగా వెలిశాయి. మొదటి ప్రోలరాజు శైవాన్ని ఆదరించాడు. ఇతడి గురువు రామేశ్వర పండితుడు. ఇతడు 'లకులీశ్వర-ఆగమ మహాసిద్ధాంతం'లో నిష్ణాతుడు. గణపతిదేవుడి కాలంలో 'పాశుపతశైవం' విశేష ఆదరణ పొందింది. ఇతని గురువు విశ్వేశ్వర శివాచార్యులు. కాకతీయుల కాలంలో శివాలయాలు విరివిగా నిర్మించారు. శ్రీశైలం, ద్రాక్షారామం, త్రిపురాంతకం, అలంపురం గోళకీ మఠాలకు ప్రధాన కేంద్రాలయ్యాయి. ఆనాడు శైవమతంతో పాటు వైష్ణవ మతం కూడా ప్రాచుర్యం పొందింది. కాకతి రుద్రదేవుని కాలంలో దక్షిణ ప్రాంతంలో రామానుజాచార్యుని వైష్ణవమతం వ్యాపించింది. కాకతీయులకు సమకాలికుడైన బ్రహ్మనాయుడు పల్నాటిసీమలో వీర వైష్ణవ మతాన్ని ప్రారంభించాడు. నాగమ్మ శైవ మతాన్ని అనుసరించింది. కాకతీయుల కాలంలో గ్రామీణ ప్రజలు గ్రామ దేవతలను ఆరాధించేవారు. కాకతమ్మ, ఏకవీర, భైరవ, మైలారభటులు ముఖ్య దేవతలు. పాల్కురికి సోమనాథుడు 'బసవపురాణం', 'పండితారాధ్య చరిత్ర' రచించి వీరశైవాన్ని ఉధృతం చేశాడు.

జైన, బౌద్ధ మతాలు ఈ యుగంలో ఆదరణ కోల్పోయి, వీరి నిర్మాణాలు శివాలయాలుగా మారిపోయాయి. కొలనుపాక, వేములవాడ, బోధన్ మొదలైన ప్రాంతాలు జైనకేంద్రాలుగా ఉండేవి. మాచర్ల, బాపట్ల, సింహాచలం, శ్రీకూర్మం వైష్ణవ కేంద్రాలుగా ఉండేవి.

**ఆర్థిక పరిస్థితులు:** కాకతీయ రాజులు, వారి సామంతులు చెరువులు, కాలువలు, బావులు తవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. ఈ కాలంలో ఓరుగల్లు, పానగల్లు, త్రిపురాంతకం, వేములవాడ, అలంపురం, కొలనుపాక, మోటుపల్లి ప్రధాన వ్యాపార కేంద్రాలు. కృష్ణపట్నం, మోటుపల్లి రేవుల నుంచి గణపతిదేవుడి కాలంలో విదేశీ వ్యాపారం విరివిగా జరిగింది. విదేశీ వ్యాపారుల సంక్షేమం కోసం గణపతిదేవుడు 'మోటుపల్లి అభయ శాసనం' వేయించాడు. కాకతీయుల కాలంలో పెద్ద చెరువులను సముద్రాలుగా పిలిచేవారు. సబ్బి సముద్రం, ఎర్ర సముద్రం, గణప సముద్రం మొదలైనవి. గంధం, దంతం, కంబళ్లు, సుగంధ ద్రవ్యాలు, పట్టు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి అయ్యేవి. తూర్పు ఆసియా దేశాలతో వర్తకం జరిగేది. కేసరి పుట్టి, కేసరి మానిక, రీకలు, మాడలు- వంటి తూకాలు ఆనాడు వాడుకలో ఉండేవి. కొలమానాల్లో వీశ, సేరు, సోల, గిద్ద వంటివి వాడుకలో ఉండేవి.

**నాణేలు:** కాకతీయుల రాజలాంఛనం వరాహం. వీరి బంగారు నాణేలను గద్యాణములని పిలుస్తారు. ఈ కాలంనాటి 39 బంగారు నాణేలు 'కమ్మరి గూడెం(ఖమ్మం జిల్లా)లో లభించాయి. 'లెంకల' పేరు మీద ఈ నాణేలు వేయడం ప్రత్యేకం.

**సాహిత్యం: సంస్కృత గ్రంథాలు:** కాకతీయుల రాజభాష సంస్కృతం. శాసనాలను సంస్కృత భాషలోనే వేయించారు. రుద్రదేవుడి అనుమకొండ శాసనప్రశస్తిని అచితేంద్రుడు సంస్కృతంలో రాశాడు. గణపతిదేవుడి గణపవరం శాసనాన్ని 'నంది' సంస్కృతంలో లిఖించాడు. నీతిశాస్త్రం (ప్రతాపరుద్రుడు), ప్రతాపరుద్రయ శోభూషణం (విద్యానాధుడు) గ్రంథాలు, రావిపాటి త్రిపురాంతకుడుని 'ప్రేమాభిరామం' అనే నాటకం.. సంస్కృతంలోనే ఉన్నాయి. జాయపసేనాని సంస్కృతంలో నృత్య రత్నావళి, గీత రత్నావళి, వాద్య రత్నావళి రాశాడు.

**తెలుగు గ్రంథాలు:** వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామం అనే నాటకం, మల్లియ రేచన - కవిరాజ జనాశ్రయం, కేతన విజ్ఞానేశ్వరీయం, బద్దెన - సుమతీ శతకం, నీతిశాస్త్ర ముక్తావళి, పాల్కురికి సోమనాథుడి బసవపురాణం, పండితారాధ్య చరిత్ర వంటి గ్రంథాలు తెలుగులో వచ్చాయి. ఇవేకాకుండా శతక సాహిత్యంలో మల్లికార్జున పండితారాధ్యుడి శివతత్వసారం, యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం, పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకం ప్రాచుర్యం పొందాయి. గోనబుద్ధారెడ్డి-రంగనాథ రామాయణం, నన్నెచోడుడు-కుమార సంభవం, మంచన - కేయూరబాహు చరిత్ర, రాజశేఖ

SAKSHI

రుడు-విధాహసాలభంజిక అనే నాటకం తెలుగులోనే వచ్చాయి. కేతన వ్యాకరణ గ్రంథం -ఆంధ్రభాషా భూషణం, మారన మార్కేం డేయ పురాణం, పాల్కురికి 'బసవోదరణం, రావిపాటి త్రిపురాం తాకా-ఉదాహరణ కావ్యాలు తెలుగులో రాశారు. కేతన-దశకుమార చరిత్రతో పాటు పంచతంత్రం, కామందక నీతిశాస్త్ర గ్రంథాలు తెలుగులో వచ్చాయి.

**కాకతీయుల దేవాలయాలు:** కాకతీయులు విభిన్న వాస్తుతో దేవాల యాలు నిర్మించారు. ప్రోలరాజు కాలంలో అనుమకొండలో సిద్ధేశ్వరా లయం, పద్మాక్షి ఆలయం, ఓరుగల్లులో స్వయంభూఆలయాలు నిర్మించాడు. గణపతిదేవుని సేనాని రేచర్ల రుద్రుడు పాలంపేటలో రామప్ప దేవాలయం నిర్మించాడు. కాకతీయుల నిర్మాణాల్లో ఓరుగల్లు కోట, అనుమకొండ వేయిస్తంభాల గుడి తోరణాలు, త్రిపురాంతకం, పిల్లలమర్రి ప్రాంతాల్లో నిర్మించిన దేవాలయాలు ప్రసిద్ధి చెందాయి. పిల్లలమర్రి దేవాలయంలో కాకతీయుల కాలంనాటి చిత్రకళ అవశే షాలు కన్పించాయి.

## మాదిరి ప్రశ్నలు

**1. కాకతీయుల కాలంలో 'లెంకలు' అంటే ఎవరు?**
ఎ) రాజు అంగరక్షకులు బి) న్యాయాధిపతులు
సి) గణాంకం చేసేవారు డి) సుంకాలు వసూలు చేసేవారు

**2. 'గద్యాణాలు' అంటే ఏమిటి?**
ఎ) వెండి నాణేలు బి) బంగారు నాణేలు
సి) రాగి నాణేలు డి) జింకు నాణేలు

**3. 'ఆయగార్లు' అంటే ఏమిటి?**
ఎ) పన్నులు వసూలు చేసేవారు
బి) రాజును కీర్తించేవారు
సి) పన్నులు లేకుండా భూమిని పొందే గ్రామ పాలకులు
డి) సైనికులు

**4. రామప్ప దేవాలయం ఏ కాకతీయ రాజు కాలంలో నిర్మాణం జరిగింది?**
ఎ) గణపతిదేవుడు బి) రుద్రమదేవి
సి) ప్రతాపరుద్రుడు డి) ప్రోలరాజు

**5. 'తలారి' అంటే ఎవరు?**
ఎ) కరణం బి) గ్రామ రక్షకభటుడు
సి) వ్యాపారి డి) గ్రామాధిపతి

**6. కాకతీయుల 'రాజలాంఛనం' ఏది?**
ఎ) వరాహం బి) సింహం
సి) చేప డి) నెమలి

**7. విదేశీ వ్యాపారుల సంక్షేమం కోసం 'మోటుపల్లి అభయశాసనాన్ని వేయించిన కాకతీయ రాజు?**
ఎ) రుద్రదేవుడు బి) రుద్రమదేవి
సి) గణపతిదేవుడు డి) ప్రతాపరుద్రుడు

**8. ఇటీవల కాకతీయుల కాలంనాటి బంగారు నాణేలు మన రాష్ట్రం లో ఎక్కడ లభించాయి?**
ఎ) వరంగల్ జిల్లా బి) పానగల్లు (నల్గొండ)
సి) సింహాచలం (విశాఖ జిల్లా)
డి) కమ్మరిగూడెం (ఖమ్మం జిల్లా)

**9. కాకతీయుల రాజభాష?**
ఎ) తెలుగు బి) కన్నడం
సి) మరాఠీ డి) సంస్కృతం

**10. సుమతీ శతక రచయిత?**
ఎ) మారన బి) కేతన
సి) బద్దెన డి) మంచన

**11. 'విధాహసాలభంజిక' అనే నాటకాన్ని ఎవరు రచించారు?**
ఎ) రాజశేఖరుడు బి) పోతనామాత్యుడు
సి) మంచన డి) భారవి

**12. కాకతీయుల కాలంనాటి 'పచ్చల సోమేశ్వరాలయం' ఎక్కడ ఉంది?**
ఎ) నాగులపాడు బి) ఘటకేశ్వర్
సి) ఘనాపూర్ డి) పానగల్లు

**13. వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం' అనే నాటకాన్ని ఏ భాషలో రాశాడు?**
ఎ) తెలుగు బి) సంస్కృతం
సి) ప్రాకృతం డి) కన్నడం

**14. కాకతీయుల కాలంనాటి 'చిత్రకళ' విశేషాలు ఏ దేవాలయంలో లభ్యమవుతున్నాయి?**
ఎ) వేయిస్తంభాల గుడి బి) పద్మాక్షి ఆలయం
సి) పానగల్లు దేవాలయం డి) పిల్లలమర్రి దేవాలయం

**15. 'గజసాహిణి' జాయపసేనాని తన నృత్య రత్నావళిని ఏ భాషలో రాశాడు?**
ఎ) సంస్కృతం బి) తెలుగు
సి) ప్రాకృతం డి) కన్నడం

**సమాధానాలు**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ఎ | 2 | బి | 3 | సి | 4 | ఎ | 5 | బి |
| 6 | ఎ | 7 | సి | 8 | డి | 9 | డి | 10 | సి |
| 11 | ఎ | 12 | డి | 13 | ఎ | 14 | డి | 15 | ఎ |

SAKSHI

# కాకతీయుల అనంతర రాజవంశాలు

కాకతీయుల అనంతరం ముస్లింల బారి నుంచి స్వదేశాన్ని, హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలన్న ఆశయంతో పనిచేసిన వారిలో ముసునూరి నాయకులు ఒకరు. ముసునూరి వంశీయుల్లో ప్రోలయనాయక, కాపయ నాయకుల పేర్లు మాత్రమే చరిత్రకందాయి. కృష్ణాజిల్లా ఉయ్యూరు తాలూకాలోని ముసునూరు గ్రామం వీరి జన్మభూమి.

## ప్రోలయ నాయకుడు (క్రీ.శ. 1325–1330)

ముసునూరి నాయక రాజుల్లో మొదటివాడు. ఇతడు రాజమహేంద్ర వరం నుంచి ముస్లింలను పారద్రోలి గోదావరి-కృష్ణ నదుల మధ్య ప్రాంతాన్ని ఆక్రమించాడు. 'రేఖపల్లి' కేంద్రంగా పరిపాలించాడు. ముస్లింలను ఎదుర్కోడానికి గెరిల్లా దాడులు నిర్వహించాడు. బ్రాహ్మ ణులకు అగ్రహారాలను కేటాయిం చి, వైదికమత ధర్మ పునరుద్ధరణకు పాటుపడ్డాడు.

## కాపయ నాయకుడు (క్రీ.శ. 1330–1365)

ప్రోలయ నాయకుడి పినతండ్రి కుమారుడు. పిల్లల మర్రి, గణపే శ్వరం, పోలవరం శాసనాలు, వెలుగోటి వంశ చరిత్ర వంటి గ్రంథాల నుంచి కాపయ నాయకుడి విశేషాలు తెలుస్తున్నాయి. ఓరుగల్లు కేంద్రంగా ఈయన రాజ్యాన్ని విస్తరింపచేశాడు. ఆంధ్ర దేశాధీశ్వర, ఆంధ్ర సురత్రాణ వంటి బిరుదులు ఇతనివే. క్రీ.శ. 1347లో బహమని రాజ్యస్థాపనలో.. హసన్‌గంగూకు సహకరించినట్లు చెప్పవచ్చు. క్రీ.శ. 1356లో అల్లావుద్దీన్ బహమన్‌షా, కాపయ నాయక రాజ్య భూభా గంపై దండెత్తినట్లు చరిత్ర చెబుతుంది. క్రీ.శ. 1362 ప్రాంతంలో కాపయ నాయకుడి కుమారుడైన వినాయకదేవ మహ్మద్‌షా బహమన్ చేతిలో హతుడయ్యాడనేది చరిత్రకారుల అభిప్రాయం. కాపయ నాయకుడు క్రీ.శ. 1365 ప్రాంతంలో రాచకొండ వెలమరాజైన మొదటి అనవోతా నాయకుడితో జరిగిన భీమవర యుద్ధంలో మరణించినట్లు తెలుస్తున్నా.. స్పష్టమైన ఆధారాలు మాత్రం లభించలేదు.

## రెడ్డిరాజులు

ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1324 ప్రాంతంలో స్వతంత్ర రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. రెడ్డిరాజులు మూడు ప్రాంతాల నుంచి పాలించారు.

1) క్రీ.శ. 1324 నుంచి 1424 వరకు మొదట అద్దంకి, తర్వాత కొండవీడు రాజధానిగా ప్రోలయ వేమారెడ్డి మొదలు రాచవేమారెడ్డి వరకు పాలించిన వారు కొండవీటి రెడ్డిరాజులుగా ప్రతీతి.

2) క్రీ.శ. 1402 నుంచి 1448 వరకు రాజమహేంద్రవరం రాజధానిగా కాటయ వేమారెడ్డి నుంచి వీరభద్రారెడ్డి వరకు పాలించిన వారు రాజమహేంద్రవర రెడ్డిరాజులు

3) ప్రోలయ వేమారెడ్డి సోదరుడైన మల్లారెడ్డి అతని వంశీయులు కందుకూరు రాజధానిగా పాలించినవారు కందుకూరి రెడ్డిరాజులుగా ప్రతీతి.

## ప్రోలయ వేమారెడ్డి (క్రీ.శ. 1324–1353)

మొదటి కాకతీయ రాజైన రెండో ప్రతాపరుద్రుడి వద్ద సేనానిగా వ్యవహరించాడు. కాకతీయుల పతనానంతరం ముస్లింలను పారదోలే ప్రయత్నంలో ముసునూరి కాపయ నాయకుడికి తోడ్పడి అతని కాలంలో అద్దంకి కేంద్రంగా స్వతంత్ర రెడ్డిరాజ్యాన్ని స్థాపించాడు. ఈయన సోదరుడైన మల్లారెడ్డి బహమని సుల్తాన్ హసన్‌గంగు దాడు లను ఎదుర్కొన్నట్లు తెలుస్తుంది. ప్రోలయ వేమారెడ్డి వైదిక మతాభి మాని. ఈయన కాలంలో శ్రీశైలం, అహోబిలం ఆలయాలకు సోపా నాలు, శ్రీశైలంలో పాతాళగంగకు మెట్లు కట్టించినట్లు తెలుస్తుంది. ఈయనకు ధర్మ ప్రతిష్టాగురు, మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవ (మల్లవరం శాసనం ప్రకారం) వంటి బిరుదులున్నట్లు తెలుస్తోంది. కవిత్రయంలో చివరివాడైన ఎర్రాప్రగడ వేమారెడ్డి ఆస్థానంవాడే. మహాభారతంలో అరణ్య పర్వ శేషభాగాన్ని తెలుగులోకి అనువదించిన ఎర్రన.. హ రివంశం, నృసింహపురాణం రాశాడు. ఎర్రనకు శంభుదాసుడు అనే బిరుదు ఉంది. తాను రాసిన హరివంశ గ్రంథాన్ని వేమారెడ్డికి అంకిత మిచ్చారు.

## అనపోతారెడ్డి (క్రీ.శ. 1353–1364)

ఈయన ప్రోలయ వేమారెడ్డి దత్తపుత్రుడు. వీరన్న పోతుగా ప్రసిద్ధి. భద్రత కోసం రాజధానిని అద్దంకి నుంచి కొండవీడుకు మార్చాడు. జలదుర్గమైన తంగడ దీవిని జయించి 'ద్వీప విజేత'గా పేరుగాంచా డు. ఈయన కాలంలో విదేశీ వ్యాపారం అభివృద్ధి చెందింది. ఈయన మంత్రి సోమయ, మోటుపల్లిలో అభయ శాసనాన్ని వేయించినట్లు తెలుస్తుంది. ఇతని పాలనాకాలంలో క్రీ.శ. 1361 ప్రాంతంలో బహమని సుల్తానులు అమరావతిపై దండెత్తి అమరేశ్వరాలయాన్ని ధ్వంసం చేయగా, అనపోతారెడ్డి మంత్రి అల్లయ వేమన, సుల్తానుల దాడిని తిప్పికొట్టి అమరేశ్వరాలయాన్ని పునరుద్ధరించాడు. అనపోతా రెడ్డి కాలంలో వేయించిన శాసనాల రచయితగా బాల సరస్వతి పేరు కనిపిస్తుంది. అనపోతారెడ్డి రాజధాని మార్పు గురించి తెలుపుతున్న శాసనం 'మాన్యమాపుర శాసనం'.

## అనవేమారెడ్డి (క్రీ.శ. 1364–1386)

ఈయన అనపోతారెడ్డి సోదరుడు. కొండవీటి రెడ్డిరాజుల్లో ఘనుడు. కవి పండితులను ఆదరించాడు. 'బహు సహస్ర సువర్ణదాన సంతో

SAKSHI

షిత మహాకవీశ్వర' అని ప్రఖ్యాతిగాంచాడు. లెక్కకు మించి దాన ధర్మాలు చేసిన ఘనుడు. శ్రీశైలంలో వీరశిరోమండపం ఇతని కాలం లో నిర్మించిందే. ఇతని సేనాని చెన్నమ నాయకుడు కళింగపై విజయం సాధించినట్లు తెలుస్తుంది. వేమారెడ్డి మంత్రి మామిడి పెద్దనామాత్య. అనవేమారెడ్డిని కవులు 'వసంతరాయ' అని కీర్తించారు.

## కుమారగిరి రెడ్డి (క్రీ.శ. 1386–1402)

ఇతడు ప్రతి సంవత్సరం తన రాజ్యంలో వసంతోత్సవాన్ని నిర్వహించే వాడు. 'కర్పూర వసంతరాయ'గా ప్రసిద్ధి. ఇతని ఆస్థాన నర్తకి 'లకుమాదేవి'. కుమారగిరి రెడ్డి స్వయంగా సంస్కృతంలో 'వసంత రాజీయం' అనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రచించాడు. కుమారగిరి రెడ్డికి ప్రధానిగా, సర్వసైన్యాధిపతిగా వ్యవహరించిన వ్యక్తి కాటయ వేమారెడ్డి. ఇతడు కుమారగిరి రెడ్డి బావమరిది. కుమారగిరి రెడ్డి పాలన కాలంలోనే కాటయవేమారెడ్డి రాజమహేంద్రవరం రాజధానిగా ప్రత్యేక రెడ్డిరాజ్యాన్ని స్థాపిం చాడు. కాళిదాసు నాటకాలకు కుమారగిరి రాజీయం పేర వ్యాఖ్యానాలు రాసిన ఘనత కాటయ వేమారెడ్డికి దక్కుతుంది. విజయనగర రాజైన రెండో హరహరరాయలు తన కుమార్తె 'హరిహరాంబ'ను కాటయ వేమునికిచ్చి వివాహం జరిపించినట్లు తెలుస్తుంది. కాటయ వేముడు తన రాజమహేంద్ర రాజ్యాన్ని కటక్ వరకు విస్తరించి 'కటక చురకార' అనే బిరుదును ధరించాడు. కాటయ వేముడు అత్తిలి యుద్ధంలో తిప్పన చేతిలో మరణించాడు.

## పెదకోమటి వేమారెడ్డి (క్రీ.శ. 1402–1420)

ఇతడు రాజ్యాధికారం చేపట్టగానే ఒకవైపు విజయనగర రాజులతోనూ, మరోవైపు రాజమహేంద్రవరం కేంద్రంగా స్వతంత్రులైన రాజమహేంద్రవర రెడ్డిరాజులతోనూ పోరాడాడు. రాజమహేంద్రవర రాజైన కాటయవేముడు, విజయనగర చక్రవర్తి మొదటి దేవరాయలతో మైత్రి చేసుకుని పెదకోమటి వేమారెడ్డిని ఎదిరించి అత్తిలి యుద్ధంలో మరణించాడు.

పెదకోమటి వేమారెడ్డి బహమని రాజైన ఫిరోజ్‌షాతో సంధి చేసుకున్నాడు. పెదకోమటి వేమారెడ్డి స్వయంగా కవి. ఇతడు సంగీత చింతామణి, సాహిత్య చింతామణి వంటి గ్రంథాలను రాశాడు. ఇతని ఆస్థానంలో విద్యాధికారిగా వ్యవహరించిన శ్రీనాథుడు ప్రముఖ కవి. కవిసార్వభౌమ బిరుదాంకితుడు. శ్రీనాథుడు విజయనగర రాజైన రెండో దేవరాయల ఆస్థానంలో ఉన్న గౌడ డిండిమభట్టును వాదనలో ఓడించి రెండో దేవరాయలతో కనకాభిషేకం చేయించుకున్నాడు. మరుత్తరాట చరిత్ర, శృంగార నైషధం, హరవిలాసం, భీమేశ్వర పురాణం, పల్నాటివీర చరిత్ర, శివరాత్రి మహత్యం, కాశీఖండం వంటి రచనలు శ్రీనాథునివే. వామనభట్టబాణుడు 'వేమ భూపాలం' అనే పేరుతో పెదకోమటి వేమారెడ్డి చరిత్రను రాశాడు. కవి పండిత పోషకుడిగా పేరుగాంచి, పెదకోమటి వేమారెడ్డి రెడ్డిరాజుల్లో 'గొప్ప కవిరాజు'గా పేరు గాంచాడు. పెదకోమటి వేమారెడ్డి భార్య సూరాంబిక నిర్మించిన తటాకమే సంతాన సాగరం.

## రాచవేమారెడ్డి (క్రీ.శ. 1420–1424)

ఇతను పెద్ద కోమటి వేమారెడ్డి కుమారుడు. ప్రజలను క్రూరంగా అణచే దమననీతిని అనుసరించిన మొట్టమొదటి రెడ్డిరాజు. ఇతని కాలంలో విధించిన పన్ను 'పురిటి సుంకం' ఇతని కాలంలో గజపతులు, విజయనగర ప్రభువులు రెడ్డి రాజ్యంపై దండెత్తారు. ఫలితంగా రెడ్డి రాజ్యం చిన్నాభిన్నమయింది.

## రాజమహేంద్రవర రెడ్డి రాజులు

కొండవీటి రాజ్య పాలకుడు కుమారగిరిరెడ్డి తన రాజ్యంలోని తూర్పు రాజ్యాన్ని 'పూర్వ రాజ్యం' అనే పేరుతో ప్రకటించి.. తన బావమరిది, ప్రధాన సైన్యాధిపతియైన కాటయ వేమారెడ్డికి అప్పగించాడు. కాటయ వేముడు అత్తిలి యుద్ధంలో మరణించిన తర్వాత ఆయన కుమారుడైన రెండో కుమారగిరి రెడ్డి, పిన్నవయస్కుడు కావడంతో అల్లాడరెడ్డి, కాటయ వేముడి కుమార్తె 'అనితల్లి'ని రాణిగా చేశాడు. అల్లాడరెడ్డి, తన కుమారుడైన వీరభద్రారెడ్డికి 'అనితల్లి'నిచ్చి వివాహం జరిపించి తను మరణించేవరకు ఆ రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడాడు. 'కలువ చెరుశాసనం' అనితల్లి కాలంలో వేయించిందే. రాజమహేంద్రవర రెడ్డి రాజ్యంలో చివరివాడు వీరభద్రా రెడ్డి. క్రీ.శ 1448 ప్రాంతంలో కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించుకున్నట్లు తెలుస్తుంది.

## ప్రాక్టీస్ ప్రశ్నలు...

**1.'పురిటి సుంకం' ఇతని కాలంలో వేసిన పన్ను?**

ఎ) ప్రోలయవేమారెడ్డి బి) రాచవేమారెడ్డి
సి) కుమారగిరిరెడ్డి డి) అనపోతారెడ్డి

**2.రెడ్డి రాజులలో గొప్పవాడు?**

ఎ) అనవేమారెడ్డి బి) ప్రోలయవేమారెడ్డి
సి) రాచవేమారెడ్డి డి) కుమారగిరిరెడ్డి

**3.'లకుమాదేవి' ఎవరి ఆస్థాన నర్తకి?**

ఎ) ప్రోలయవేమారెడ్డి బి) కుమారగిరిరెడ్డి
సి) అనపోతారెడ్డి డి) రాచవేమారెడ్డి

**4.స్వతంత్ర రాజమహేంద్రవర రెడ్డి రాజ్యస్థాపకుడు?**

ఎ) మల్లారెడ్డి బి) కాటయ వేమారెడ్డి
సి) ప్రోలయ వేమారెడ్డి డి) కుమారగిరి రెడ్డి

| జవాబులు | 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|---|
| | B | A | B | B |

SAKSHI